# కోరి భుజింతును - గోంగూర పచ్చడి

ఆఫీసునించి ఇంటి కొచ్చేసరికి ఇల్లంతా చింపి పోసిన కాగితం ముక్కల్తో నిండివుంది. డాక్టరుగారు నిన్న సాయంకాలం చెప్పారు; ఆయన ఇవ్వవలసిన 59 ఇంజక్షన్లూ అయిపోయాయని, ఇవాళ్టినుంచి సుమతి మామూలు మనిషై పోతుందని.

ఇవాళ కూడా సుమతి పిచ్చిచూపులు చూడ్డం, ఇల్లంతా చౌల్ట్రీలా చెయ్యడం చూసి దీర్ఘంగా విశ్వసించాను. అయినా నాకు కోపం రాలేదు. "అత్యంత ప్రేమతో ఆమెను నా రెండు హస్తాలలో పొదివి పట్టుకుని"—

"జీవితాంతం వసంతం వుంటుందనుకున్నాను సుమతీ, నీ సాహచర్యంలో....నన్నూ, మన ప్రేమ చిహ్నాలయిన యిద్దరు అమాయిక శిశువుల్నీ ఇలా కలకాలం విషాదంలో, నిర్వేదంలో ముంచే నీ వ్యాధిక్కారణ మేమిటి? ఇప్పటికైనా చెప్పవా?" అన్నాను.

సుమతి కళ్ళు ఆనందంతో చెమర్చాయి.

"చెప్పు; ఏమిటి నీ బాధ!" అన్నాను. మళ్ళీ సుమతి పిచ్చి చూపులు చూసింది. నా "లాంగ్వేజీ"లో ఏదో పొరపాటుందని గ్రహించేను, ఐనా ఏం చెయ్యను?

ఏడేళ్ళయింది, మా పెళ్ళయి. హాయిగా వున్నాం. రత్నాల్లాంటి బిడ్డలిద్దరు పుట్టారు. సుమతికి బాధ్యతల్లేవు. సౌఖ్యాలు కొల్లలు. మరి ఈ వ్యాధేమిటో తెలీలేదు. మూణ్ణెల్లయింది ఇలాగ, ఉద్యోగం మానేసో, శెలవెట్టేసో సుమతికి పరిచర్యలు చేద్దామంటే కంపెనీలో నేను లేకపోతే క్షణం వెళ్ళదు. ఆమె తోటకూరకాడలా వసివాడిపోతూ గృహకృత్యాలు కూడా (చేయక్కర్లేదు; కాని చేసేది) చెయ్యలేకపోతూ వుంటే మంచి డాక్టర్ని పెట్టడంతప్ప నేనూ ఏమీ చెయ్యలేకపోయాను.

వాకిట్లో అలికిడైతే చూశాను. రంగనాధరావు పలకరించడం వినబడింది. అతను నా వేదనంతా విని అన్నాడు: "కనకదుర్గాపురంలో ఒక మానసిక వైద్యుడున్నాడు. ఆయన దగ్గిరికి తీసుకెళ్ళు. అల్లోపతి, హోమ్యోపతి అంటూ కొంప తీసుకోకు."

ఆయన అడ్రసు తీసుకొని నా సెలవు కాయితం రంగనాధరావు కిచ్చేను. ఆఫీసులో వ్యవహారాలు బెడిసికొట్టకుండా చూస్తానన్నాడు రంగనాధరావు.

"నాలుగు రోజులు చికిత్స. మీరు నేను ఖాళీగా వున్నప్పుడు రావడం మీ అదృష్టం!" అన్నాడు మానసిక వైద్యులు శ్రీ సత్య నారాయణగారు. "నాలుగు రోజులూ మీరు మా ఇంట్లోనే వేరే గదిలో వుండొచ్చు. కాని చికిత్స పూర్తయ్యేవరకు మీరు ఆవిణ్ణి నా గదిలోనే వుంచాలి. అక్కడే భోజనం, అక్కడే నిద్రా అన్నీనూ" అన్నా రాయన.

"పచ్చని సంసారంలో చిచ్చుల సురసురలు" స్ఫురించి హడలి పోయాను.

అదేదో పసిగట్టిన వాళ్ళాగ, "అబ్బే! నేనంత నీచుణ్ణికాదు. నా గదిలో సుమతిగారు ఏకాంతంగా వుండరు మా చెల్లి, మా ఆవిడా అందరూ అక్కడే వుంటారు." అన్నారు మళ్ళీ సత్యనారాయణగారు.

సరేనన్నాను. నాలుగు రోజులపాటు విరహం సస్పెన్సు భరించ లేక ఓవరేజి ఇంగ్లీషు పాఠకుడుగా వుండే నేను "యావ"రేజి తెలుగు పాఠకుడిలా తయారయ్యేను. నాకూ, మా శ్రీమతి సుమతికి సంబంధ మల్లా, నేనుండే గదిలో ఒక టెలిఫోన్ ఎక్స్‌టెన్షన్‌ద్వారా మా ఆవిడతో మాట్లాడి నా టెన్షన్ తగ్గించుకోగలగడమే.

ఐదోరోజు మా ఆవిడ ఉషోదయంతోనే నా గదిలో కొచ్చింది. "యావండీ! నావల్ల మీ కెంత ఇబ్బందైంది. పదండి మన ఊరు పోదాం. కంపెనీలో మీ ఎం. డి. గారు మీర్లేక ఎంత బాధపడు తున్నారో!" అంటూ మామూలుగా మాట్లాడ్డం. ఏదో మంత్రం వేసి నట్టు వెనకటిలా జెబ్బలూ కండలూ వచ్చి మనిషి నిండుగా కనబడ్డం చూసి నా కళ్ళని నేనే నమ్మలేకపోయాను.

తిన్నగా వెళ్ళి సత్యనారాయణగారికి షేక్హాండిచ్చాను. "నా సంసారానికి పునరుజ్జీవనం కలిగించేరు. మీ రుణం తీర్చుకోలేను!" అన్నాను. తీర్చుకోగలనని తెలిసుండే.

"అలాంటిదేం పెట్టుకోవద్దు. ఇది నా విధి. ఇందులో రుణదాతలు లేరు. రుణగ్రస్తులూ లేరు!" అని టాగోర్‌గారిలా నవ్వాడాయన నిజంగానే. నేను ఆఫర్ చేసిన డబ్బు పుచ్చుకోలేదు. ఎంత ప్రతిమాలినా చిరునవ్వే సమాధానం.

"పోనీ, మా ఆవిడ వ్యాధేమిటో మీ చికిత్సేమిటో చెప్పి నాకు జ్ఞానోదయమైనా కలిగించండి!" అని కాళ్ళమీద పడబోయాను.

"కొంతకాలం కిందట "అరుణ తార" అని ఒక వారపత్రిక వుండేది. అందులో "కరుణామయుని అరుణ కిరణాలు" అనే సీరియల్ వస్తుండేది (రచయిత్రి: గోంగూర ప్రేమలత) కారణాంతాలవల్ల ఆ పత్రిక మూడునెలల కిందట ఆగిపోయింది. ఆఖరు సంచికలో "అరుణ చచ్చిపోతుందా? సుబ్బారావు ఆత్మహత్యా ప్రయత్నం సఫలమౌతుందా? కిరణ్ జన్మరహస్యం కరుణాదేవికి తెలుస్తుందా? అనే ప్రశ్నలకు సమాధానాలు వచ్చే సంచికలో చూడండి. అని సంపాదకులు రాశారు....ఆ వచ్చే సంచిక అన్నది అసలు రాలేదు. ఆ ప్రశ్నలకు సమాధానాలు తెలియక ఆ నవల పాఠకులు చాలామంది ఇదే మానసిక వ్యాధికి గురయ్యారు" అన్నారాయన.

"మరి మీ చికిత్సేమిటి, దానికి?"

"ఏముంది? ఆ సీరియల్‌లో అముద్రిత భాగం అంతా ఈ వ్యాధిగ్రస్తులకు వినిపించడమే. దానికే నాలుగు రోజులు - అంటే మొత్తం అరపైనాలుగు గంటలు. ఆ మిగిలిన కథా భాగం విన్న తరువాత ఇక ఎట్టి సందేహానికి గాని, వ్యాధికి గాని తావుండదు!"

"అంతా బాగానే వుంది, ఆ భాగాలు మీ కెలా దొరికాయి?" అన్నాను నిస్సహాయంగా.

సత్యనారాయణగారు విజయగర్వంతో నవ్వుతూ, "గోంగూర ప్రేమలత" అనే పేరుతో సీరియల్ నవలలు రాసేది తామేనని చెప్పారు.

(12-11-77)

(మిత్రుడు ద్విభాష్యం రాజేశ్వరరావుకి కృతజ్ఞతలతో)